సాక్షి
అనకాపల్లి
సోమవారం : 25 : నవంబర్ : 2024



ఎడ్ల బళ్ల పోటీల విజేత కేజేపురం
మామిడిపల్లిలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీల్లో కేజేపురానికి చెందిన ఎడ్లు ప్రథమ స్థానంలో విజేతగా నిలిచాయి. 8లో

బండిమాంబ... నమో..నమః



ఏటికొప్పాకలో బండి మాంబ అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా జరిగింది. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పునుపు, కుంకుమలు సమర్పించారు. 8లో



2 నుంచి మార్గశిర మాసోత్సవాలు
కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో డిసెంబర్ 2 నుంచి 30వ తేదీ వరకు మార్గశిర మాసోత్సవాలను నిర్వహించనున్నారు. 8లో

న్యూస్‌రీల్

అంధ ఉద్యోగుల అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం



నూతన కార్యవర్గంతో రాష్ట్ర నాయకులు

అనకాపల్లి: అంధ ఉద్యోగుల అసోసియేషన్ అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల సంయుక్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక కోడిగంటి గోవిందరావు భవనంలో ఆదివారం ఈ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షునిగా కొరుప్రోలు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పల్లా పోతురాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గొల్లవిల్లి సురేష్ కుమార్, మహిళా కార్యదర్శిగా గరికపాటి గౌతమి, కోశాధికారిగా కాట్రపల్లి వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా పరిశెట్టి అప్పారావు, ఎస్.నాగమణి, సహాయ కార్యదర్శులుగా ఎం.అనురాధ, శివశంకర్, అనకాపల్లి, అల్లూరి జిల్లాల అసోసియేట్‌అధ్యక్షుడిగా కోన బాబూరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా వెంకటేశ్వరరావు, బమ్మిడి రమణ, ఆలీలు వ్యవహరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన అధ్యక్షుడు కొరుప్రోలు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అంధ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రబాబు, రాష్ట్ర నాయకులు దాసరి సింహాచలం, కిమిడి కాసులమ్మ, ఎల్.బుజ్జి, వి.అప్పారావు, గోకాడ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

క్విజ్‌లో 2,50,000 మార్కుదాటిన రాంబాబు



ధ్రువీకరణ పత్రం స్వీకరిస్తున్న రాంబాబు

రోలుగుంట: మండలంలోని కుసర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోషల్ టీచర్‌గా పనిచేస్తున్న అప్పన రాంబాబు మైగవర్న మెంటు క్విజ్ ఆన్‌లైన్ పోటీల్లో 2,50,000 మార్కు దాటారు. వికసిత్ భారత్, ఆజాదీకా అమృత మహోత్సవం, స్వచ్ఛభారత్, బేటీ బచావ్, బేటీ పఢావో, వీరగాథ, ఎన్నికలు,నేషనల్ లీడర్స్, వారసత్వ ప్రదేశాలు తదితర ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొని 2,50,000 మార్కును దాటి, ఎన్‌సీఈఆర్టీ నుంచి సర్టిఫికెటు పొందారు.

ధరణి పుత్రులపై ధరల పిడుగు



యలమంచిలి పెంజెరువు ఆయకట్టు భూముల్లో వరిపంటకు ఎరువు వేస్తున్న రైతు (ఫైల్)

అన్ని వర్గాల ప్రజలపై కూటమి ప్రభుత్వం తన ప్రతాపం చూపుతోంది. పేద, మధ్య తరగతి ప్రజలకు బతుకులు భారంగా మారాయి. తాజాగా అన్నదాతలపై ధరల పిడుగు పడింది. ఎరువుల ధరలు విపరీతంగా పెంచేశారు. 50 కిలోల బస్తాకు రూ.100 వరకు పెరగడంతో ఏం చేయాలో పాలుపోక రైతన్నలు దిగులు చెందుతున్నారు. ఈ ప్రభుత్వ హయాంలో ఎటువంటి పెట్టుబడి సాయం అందకపోవడంతో అప్పుల పాలైన రైతులపై అదనపు భారం పడడం మరింత కుంగదీసింది. ఎరువుల ధరల పెరుగుదల కారణంగా జిల్లాలోని అన్నదాతలపై రూ.10 కోట్ల అదనపు భారం పడుతోంది.

- భారీగా పెరిగిన కాంప్లెక్స్ ఎరువుల ధరలు
- బస్తాకు రూ.100 వరకు పెంపు
- జిల్లా రైతాంగంపై ఏడాదికి రూ.10 కోట్ల అదనపు భారం
- పెరగనున్న పెట్టుబడి వ్యయం

ప్రస్తుతం ఎరువుల ధరలు

50 కిలోల బస్తా ధర (రూపాయల్లో)	
20-20-013	1,300
డీఏపీ	1,350
14-35-14	1,800
28-28-0	1,700
పొటాష్(ఎంఓపీ)	1,500
10-26-26	1470
అమ్మోనియం సల్ఫేట్	9,25
15-15-15 ప్యాక్ట్	1,250
24-24-0	1,800
యూరియా(45 కిలోల బస్తా)	266
16-16-16	1,375
12-32-16	1,470

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో అన్ని రకాల పంటలు కలిపి సుమారు 64,101 హెక్టార్లలో సాగు చేస్తుంటారు.ఈ పంటల కోసం సుమారు 35,353 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు వినియోగిస్తారు.రబీ సీజన్‌లో పంటల సాగు విస్తీర్ణం 16,011 హెక్టార్లుగా వ్యవసాయాధికారులు అంచనా వేశారు. వీటి సాగు నిమిత్తం సుమారు 15,924 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయి. మొత్తంగా ఏడాదికి రెండు సీజన్లలో 51,364 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులను రైతులు వినియోగిస్తారు.ఈ లెక్కన పెరిగిన ఎరువుల ధరలతో జిల్లా రైతాంగంపై ఏడాదికి సుమారు రూ.10 కోట్లకు పైగా అదనపు భారం పడనుంది.జిల్లాలో పంటల **సాగులో** వరిదే అగ్రస్థానం. ఎకరా వరికి ఒక బస్తా **డీఏపీ,**రెండు బస్తాల కాంప్లెక్స్ ఎరువులు వినియోగిస్తారు. కూలీ రేట్లు,విత్తనాలు,ఎరువులు, పురుగు మందుల ధరలు ఏటా పెరుగుతూనే ఉన్నాయి.ఆ స్థాయిలో వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ ధరలు పెరగడంలేదు. ప్రధానంగా రసాయన ఎరువుల ధరలు భారీగా పెరగడంతో తమపై అదనపు భారం పడుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.కూటమి ప్రభుత్వం స్పందించి ఎరువుల ధరలు తగ్గించడంతో పాటు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయం రూ.20 వేలు అందించి ఆదుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

రూ.10 కోట్ల అదనపు భారం

యలమంచిలి రూరల్: జిల్లాలో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు కీలక దశలో ఉన్నాయి..కొన్ని ప్రాంతాల్లో రబీ సాగుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్న వేళ ఎరువుల ధరల రూపంలో అదనపు భారం పడింది.ఇప్పటికే సాగు పెట్టుబడి వ్యయం పెరిగి..పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించక రైతులు అప్పుల పాలవుతున్నారు. రైతులను ఆదుకోవాల్సిన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పట్టనట్టు వ్యవహరిస్తున్నాయి.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు పెట్టుబడి సాయం కింద పైసా కూడా అందించలేదు. తాము అధికారంలోకి వస్తే రైతులకు అన్నదాత సుఖీభవ పేరుతో ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని ఎన్నికల ముందు నమ్మబలికారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇప్పటికే ఐదు నెలలు పూర్తయింది.కానీ ఆదుకున్నపాపాన పోలేదు.ఈ నేపథ్యంలో ఎరువుల ధరలు భారీగా పెరగడంతో వారిపై మరింత భారం పడింది. జిల్లాలో రైతులు ఎక్కువగా వినియోగించే కాంప్లెక్స్ ఎరువులు రకాన్ని బట్టి 50 కిలోల బస్తాకు రూ.100 వరకు పెరగడంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. ఎరువుల ఉత్పత్తికి వినియోగించే ముడి పదార్థాల ధరలు పెరిగిపోవడంతో ఎరువుల ధరలు పెరిగినట్టు డీలర్లు చెబుతున్నారు.దీంతో పంటల సాగు ఖర్చు ఎకరాకు రూ.3 వేల వరకు పెరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

మూడు రకాల ధరలు పెంపు

సాగులో ఎక్కువగా వినియోగించే మూడు రకాల ఎరువుల ధరలను ఉత్పత్తి కంపెనీలు పెంచి అన్నదాతలపై భారం మోపాయి.యూరియా మినహా రైతులు ఎక్కువగా వాడే 20-20-013, 14-35-14, 24-24-0 కాంప్లెక్స్ రకాల ఎరువుల ధరలు ఒక్కసారిగా పెరిగాయి. మొన్నటివరకు 20-20-013 కాంప్లెక్స్ ఎరువు బస్తా రూ.1,200 ఉండగా ప్రస్తుతం రూ.1,300కు చేరింది.14-35-14 బస్తా ధర రూ.1,700 ఉండేది..ఇప్పుడది రూ.1,800 కు చేరింది.24-24-0 ధర రూ.1,700 నుంచి రూ.1,800 కు పెరిగింది.డీఏపీ ధర పెరిగిందని ఇటీవల కొన్ని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగినా ప్రస్తుతానికి ఎటువంటి మార్పు లేదని డీలర్లు చెబుతున్నారు. ఇప్పుడు డీఏపీ బస్తా ధర రూ.1,350గా ఉంది.త్వరలోనే ఈ ధర కూడా పెరిగే అవకాశం లేకపోలేదని కొందరు డీలర్లు చెబుతున్నారు.

డాలర్ విలువ పెరగడంతో..

ఇటీవల అంతర్జాతీయ మార్కెట్లో డాలర్ విలువ పెరిగి... రూపాయి విలువ పతనమవడంతో ఆ ప్రభావం ఎరువుల తయారీకి వాడే ఫాస్పారిక్ ఆమ్లం, అమ్మోనియా లాంటి ముడి సరుకులపై పడింది.అందువల్లే కొన్నిరకాల కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెంచామని సంబంధిత కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారు.గత సెప్టెంబర్ వరకు అంతర్జా

ఎరువుల ధరలు బాగా పెరిగాయి



కాంప్లెక్స్ ఎరువుల ధరలు బాగా పెరిగాయి.గతంలో ఎప్పుడూ ఒకేసారి ఇలా పెరగలేదు.పురుగు మందుల ధరలు కూడా పెరుగుతున్నాయి.దుక్కి దున్నింది మొదలు అన్ని రకాల ఖర్చులు పెరిగాయి.దీంతో ఎకరానికి గతంలో కంటే రూ.2,500 నుంచి రూ.3,000 వరకు రైతులపై భారం పడుతోంది.పెరిగిన ఎరువుల ధరలపై పునరాలోచించి ధరలను నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

– మొగిలి నర్సింగరావు,రైతు,పీఎస్ఆర్‌పేట, యలమంచిలి మండలం

వ్యవసాయం ఎలా చేయాలి



మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా మారింది రైతుల పరిస్థితి. పెట్టుబడి ఖర్చులతో వ్యవసాయం భారంగా మారిన తరుణంలో ఇలా ఎరువుల ధరలు పెంచడం దారుణం. వ్యవసాయం చేయలేని పరిస్థితి నెలకొంది.ఎరువుల ధరలకు రెక్కలు రావడంతో మా ప్రాంతంలో రైతులందరూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.దిగుబడులు ఆశించిన స్థాయిలో రాకపోతే అప్పుల పాలుకాక తప్పదు.

– పండల వరలక్ష్మి,రైతు,గోకివాడ, రాంబిల్లి మండలం

ధరలు నియంత్రించాలి



ప్రభుత్వాలు రైతుల పరిస్థితిని పట్టించుకోకుండా తరచూ ఎరువుల ధరలు పెంచడం చాలా దారుణం.రైతులు సాగు చేస్తున్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమైన ప్రభుత్వాలు ఇష్టానుసారంగా ఎరువుల ధరలు పెంచడం సరికాదు.రైతుల పరిస్థితిని అర్థం చేసుకొని ధరల నియంత్రణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

– కొళ్ల శ్రీనివాసరావు, రైతు,పోతురెడ్డిపాలెం, యలమంచిలి మండలం

మోయలేని భారం



అసలే సాగు పెట్టుబడులు పెరిగి వ్యవసాయం అంటేనే భయపడుతున్న తరుణంలో ఎరువుల ధరలు పెంచడం దారుణం.వీటిని నియంత్రించాలి. పెరిగిన ధరలతో సాగు చేయాలంటేనే రైతులు భయపడే పరిస్థితి వచ్చింది. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే పెరిగిన ఎరువుల ధరలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి.

– కర్రి అప్పారావు, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు

ప్రధాని పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- 29న ఏయూ మైదానంలో బహిరంగ సభ, రోడ్‌షో
- వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్న ప్రధాని

మహారాణిపేట(విశాఖ): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈనెల 29వ తేదీన విశాఖ పర్యటన నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని విశాఖ కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన కలెక్టరేట్‌లో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ, రోడ్ షో గురించి ఎంపీ ఎం.శ్రీభరత్, ప్రభుత్వ విప్ గణబాబు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, పి.వి.ష్ణుకుమార్ రాజు, పంచకర్ల రమేష్ బాబు, అధికారులతో చర్చించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వీవీఐపీల రాక, ప్రధాన మంత్రికి స్వాగతం ఏర్పాట్లు, ప్రజలకు తాగునీరు, ఆహారం, ఇతర వసతుల కల్పన తదితర అంశాలపై ప్రజా ప్రతినిధులు, అధికారులు సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ శంఖబత్ర బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్, ఆర్డీవోలు పి.శ్రీలేఖ, సంగీత్ మాథుర్, డీసీపీలు, ఇతర రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటన ఇలా..

ప్రధాని మోదీ ఈ నెల 29వ తేదీ సాయంత్రం 3.40 గంటలకు ప్రత్యేక విమానంలో తూర్పు నౌకాదళానికి చెందిన ఎయిర్‌బేస్ ఐఎన్ఎస్ డేగాకు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో కాన్వెంట్ జంక్షన్, రైల్వే స్టేషన్, సంపత్ వినాయక్ టెంపుల్, టైకూన్, సిరిపురం జంక్షన్ మీదుగా ఎస్పీ బంగ్లా రోడ్డు నుంచి వేదిక వద్దకు 4.40 గంటలకు వస్తారు. ఈ క్రమంలో టైకూన్ జంక్షన్ నుంచి ఎస్పీ బంగ్లా వరకు రోడ్‌షోలో పాల్గొంటారు. ప్రజలకు అభివాదం చేసుకుంటూ ఏయూ మైదానంలో బహిరంగ సభకు చేరుకుంటారు. బహిరంగ సభలో రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులతో కలిసి పాల్గొంటారు. ఈ సందర్భంగా ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుతో పాటు, రైల్వే లైన్లు, మొదలైన వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్ని ప్రధాని చేయనున్నారు. సీఎం, డిప్యూటీ సీఎం ప్రసంగాల అనంతరం సాయంత్రం 5.25 నుంచి 5.43 గంటల వరకు ప్రజలనుద్దేశించి ప్రధాని ప్రసంగించనున్నారు. సాయంత్రం 5.45 గంటలకు సభా వేదిక నుంచి ఎయిర్ పోర్టుకు తిరుగుపయనమవుతారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి చేరుకోనున్నారు.

అడిగినంత ఇస్తేనే.. ఆధార్ మార్పులు

గొలుగొండ మండలం జమ్మదేవిపేటకు చెందిన విద్యార్థినికి పాఠశాలలో అపార్ సంఖ్య నమోదుకు ప్రయత్నించగా ఆధార్‌లో పుట్టిన తేదీ తప్పుగా ఉండడంతో సాధ్యం కాలేదు. దీంతో ఆమె తండ్రి గంగరాజు పుట్టిన తేదీ మార్పు కోసం నర్సీపట్నంలోని ఓ ఆధార్ కేంద్రం వద్దకు మూడు రోజుల కిందట వెళ్లి తప్పును సరిచేయాలని కోరారు. దరఖాస్తు తీసుకున్న నిర్వాహకుడు టోకెన్ నంబర్ ఇచ్చి 20 రోజుల తరువాత రమ్మన్నాడు. అత్యవసరం కావడంతో మళ్లీ శనివారం వెళ్లి నిర్వాహకుడు డిమాండ్ చేసిన రూ.350 చెల్లించాడు. దీంతో గంటలోగా ఇచ్చేందుకు నిర్వాహకుడు అంగీకరించాడు. ఇక్కడే కాకుండా మరో రెండు కేంద్రాల్లో కూడా విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.



ఆధార్ కేంద్రం వద్ద విద్యార్థుల పడిగాపులు

- కేంద్రాల్లో వసూళ్ల దందా
- అవస్థలు పడుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

నర్సీపట్నం:ఆధార్ కేంద్రాల్లో వసూళ్ల దందా జోరుగా సాగుతోంది. ప్రస్తుతం 9, 10 తరగతులు, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు అపార్(ఆటోమేటిక్ పర్మినెంట్ అకౌంట్ రిజిస్టర్) నమోదు ప్రక్రియ చేపట్టారు. కొందరు విద్యార్థులకు ఆధార్, పాఠశాల రికార్డుల్లో నమోదైన వివరాలు సరిపోలక పోవడంతో అపార్ నమోదు సాధ్యం కావడం లేదు. దీంతో అత్యవసరంగా ఆధార్ సవరణలు చేయించుకోవాల్సి వస్తోంది. ఇదే అవకాశంగా ఆధార్ కేంద్రాల నిర్వాహకులు కాసుల వేట మొదలు పెట్టారు. నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని ఎస్‌బీఐ(ఏడీబీ) బ్రాంచ్, ఆంధ్రాబ్యాంక్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయాలతో పాటు నాలుగు సచివాలయాల్లో కలిపి ఏడు ఆధార్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. అయితే వీటిలో ఐదు కేంద్రాలు పనిచేస్తున్నాయి. దీంతో ఎస్‌బీఐ(ఏడీబీ) బ్రాంచ్, ఆంధ్రాబ్యాంక్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయాల్లో గల కేంద్రాలకు డిమాండ్ పెరిగింది. తమ అవసరాలను ఆసరాగా చేసుకున్న కేంద్రాల నిర్వాహకులు అధిక వసూళ్లకు పాల్పడుతున్నారని ఆధార్ కేంద్రాలకు వచ్చే ప్రజలు ఆరోపిస్తున్నారు. కేంద్ర విద్యామంత్రిత్వశాఖ విద్యార్థులందరికీ అపార్ నమోదు తప్పనిసరి చేసింది. దీంతో సవరణలు చేసుకునేందుకు విద్యార్థులువస్తుండడంతో ఆధార్ నమోదు కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి. ఏడీబీ, ఆంధ్రాబ్యాంక్, బీఎస్ఎన్ఎల్ కేంద్రాల నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా అధిక రుసుము వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. బయోమెట్రిక్, డెమొగ్రాఫిక్ వివరాలను ఒకేసారి అప్‌టుడేట్ చేయించుకుంటే కేవలంరూ.100 చెల్లిస్తే సరిపోతుంది. క్రమ పద్ధతిలో అప్‌టుడేట్ చేయాలంటే నెల రోజుల సమయం పడుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. అయితే రూ.300 నుంచి రూ.500 ఇస్తే గంటల్లో ఆధార్ అప్ టు డేట్ అవుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు బహిరంగంగానే చెబుతున్నారు. లేదంటే రోజుల తరబడి కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోందని వాపోతున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కేంద్రాలకు వచ్చే ప్రజలను నిర్వాహకులు దోచుకుంటున్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలు

- కొత్తగా ఆధార్ నమోదు ఉచితంగా చేయాలి.
- బయోమెట్రిక్ అప్‌టుడేట్, 5-7, 15-17 ఏళ్ల మధ్య వయసు వారికి ఉచితంగా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.
- మిగిలిన వారికి రూ.100 రుసుం నిర్ణయించింది.
- డెమొగ్రాఫిక్ అప్‌టుడేట్(పేరు, చిరునామా, పుట్టిన తేదీ, ఫోన్ నంబరు ఇతర వివరాలకు రూ.50 తీసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

అధిక వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు



ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మించి ఆధార్ కేంద్రం నిర్వాహకులు వసూళ్లకు పాల్పడితే కేంద్రాల లైసెన్స్ రద్దు చేస్తాం. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకోవాలి. నిర్ణీత రుసుం కంటే అధికంగా వసూలు చేస్తే ఉపేక్షించేది లేదు.

– వి.వి. రమణ, ఆర్డీవో, నర్సీపట్నం

టీడీపీ సానుభూతిపరుల బరితెగింపు



కొత్తనాగయ్యపేటలో ధ్వంసం చేసిన సీసీ రోడ్డు (ఇన్‌సెట్)ముక్కలైన మంచినీటి పైపులైన్



- కొత్తనాగయ్యపేటలో పైపులైన్, సీసీ రోడ్డు ధ్వంసం
- సర్పంచ్ ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు
- తాగునీరు సరఫరా కాక అవస్థలు

దేవరాపల్లి: టీడీపీ నాయకులు, సానుభూతిపరులు రెచ్చిపోతున్నారు. తాము ఏం చేసినా అడిగేవాడే లేడు అన్న ధైర్యంతో బరితెగిస్తున్నారు. మండలంలోని నాగయ్యపేట పంచాయతీ పరిధిలోని కొత్తనాగయ్యపేటలో స్థానిక టీడీపీ సానుభూతిపరులు కొందరు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారు. సుమారు రూ.40 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన మంచినీటి ట్యాంక్‌కు చెందిన పైపులైన్‌ను పొక్లెయిన్‌తో పూర్తిగా ధ్వంసం చేశారు. దీంతో వారం రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఇది జరిగి వారం రోజులు కావస్తున్నా సంబంధిత గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం(ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఇదే విషయమై స్థానిక సర్పంచ్ కర్రి పుష్ప లిఖిత పూర్వకంగా పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం. గ్రామానికి చెందిన అల్లు దేముడు, అల్లు దేముడమ్మ, అల్లు గంగునాయుడు తదితరులు పొక్లెయిన్‌తో పైపులైన్ ధ్వంసం చేశారని సర్పంచ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. అల్లు గంగునాయుడు సూచనలతోనే పైపులైన్ ధ్వంసం చేశారని, ఈ విషయమై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

నామరూపాల్లేకుండా...

గ్రామంలో రామాలయానికి ఆనుకుని ఉన్న సీసీ రోడ్డును సైతం ధ్వంసం చేశారు. 50 మీటర్లమేర నామరూపాలు లేకుండా చేశారు. రోడ్డును పెచ్చుపెచ్చులుగా చేయడంతో రాకపోకలకు గ్రామస్తులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. లక్షలాది రూపాయలతో నిర్మించిన రోడ్డును ధ్వంసం చేసినా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికార్లు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించడం సరి కాదంటూ విమర్శిస్తున్నారు. ధ్వంసంచేసిన వారు టీడీపీ సానుభూతిపరులు కావడంతోనే చర్యలు తీసుకునేందుకు అధికారులు భయపడుతున్నారని స్థానికులు తెలిపారు.

కుళాయి నీరు రాక అవస్థలు



మంచినీటి ట్యాంక్ పైపులను కొంత మంది ధ్వంసం చేశారు. దీంతో సుమారు వారం రోజులుగా కుళాయి నీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇంటింటా కుళాయిలు ఉన్నా చేతి బోర్ల నుంచి నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. దౌర్జన్యంగా పైపులైన్ ధ్వంసం చేసి వారం రోజులు కావస్తున్నా, అధికార్లు పట్టించుకోక పోవడం దారుణం.

– కడారి మంగ కొత్త నాగయ్యపేట గ్రామం

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



రామాలయానికి ఆనుకుని ఉన్నవీధిలో సీసీరోడ్డును కొందరు పొక్లెయిన్‌తో పూర్తిగా తవ్వేశారు. సిమెంట్ కాంక్రీట్ పెచ్చులు పైకి తేలాయి. ప్రభుత్వ నిధులతో నిర్మించిన రోడ్డును దౌర్జన్యంగా తవ్విస్తే అధికార్లు పట్టించుకోక పోవడం దారుణం. ఇలాంటి విష సంస్కృతి గ్రామంలో ఎన్నడూ లేదు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి.

– తమటపు శంభునాయుడు, కొత్త నాగయ్యపేట.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు

కొమ్మాది(విశాఖ): బిర్సాముండా 150వ జయంతిని పురస్కరించుకుని జన జాతీయ గౌరవ దివస్ వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు రెండోరోజు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. రుషికొండ గాయత్రీ పీజీ, డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన పోటీలను ఎస్టీకమిషన్ చైర్మన్ డా.వి.జి.శంకర్రావు ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా గిరిజన సాంస్కృతిక పరిశోధనా శిక్షణ మిషన్(టీసీఆర్‌టీఎం) భవన్ ప్రాంగణంలోని గిరిజన ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన 24 స్టాళ్లను పరిశీలించారు. మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్, టీసీఆర్‌టీఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాణి మందా పాల్గొన్నారు.

కారు చిచ్చు



ఏటికొప్పాకలో పాలసేకరణ కేంద్రం వద్ద ఆదివారం మధ్యాహ్నం నిలిపి ఉంచిన కారు దగ్ధమైంది. బండిమాంబ అమ్మవారి జాతరకు గాజువాక నుంచి వచ్చిన ఓ కుటుంబానికి చెందిన కారులో అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. స్వల్పంగా పేలుళ్లు సంభవించినట్టు స్థానికులు తెలిపారు. యలమంచిలి రూరల్ ఎస్ఐ ఎం.ఉపేంద్ర ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.కారు యజమానితో మాట్లాడి ప్రమాదం వివరాలు తెలుసుకున్నారు. ఈ కారును 6 నెలల క్రితమే కొనుగోలు చేసినట్టు,దాని విలువ సుమారు 15 లక్షలుగా తెలిపారు. ప్రమాద సమయంలో దట్టమైన పొగ, పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో స్థానికులు, భయాందోళనకు గురయ్యారు. – యలమంచిలి రూరల్

సీకారు



రేవుపోలరం తీరానికి ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. అధిక సంఖ్యలో తరలిరావడంతో రద్దీ వాతావరణం ఏర్పడింది. ఇసుక తిన్నెల్లో ఉదయం నుంచి విహరించి, తీరంలో జలకాలాడుతూ సందడి చేశారు. సమీప జెట్టీపైకి ఎక్కి సంద్రం అందాలను వీక్షించి, ఫొటోలు, సెల్ఫీలు దిగారు. తీరం సమీపంలోని తోటల్లో వన భోజనాలు చేసి, లక్ష్మీమాధవ స్వామి, మినీ కైలాస్ గిరిపై గౌరీ పరమేశ్వరులను, షిరిడీ సాయి నాథుని దర్శించుకున్నారు.

– ఎస్.రాయవరం

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వర్ణపుష్పార్చనను ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. సింహగిరిపైనికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను కొలువుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

క్లుప్తంగా

ఎస్పీ కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్



హెచ్‌సీ తమ సమస్యను ఎస్పీ తుహిన్ సిన్హాకు తెలియచేస్తున్న దృశ్యం

అనకాపల్లి : ఎస్పీ కార్యాలయంలో శనివారం పోలీస్ గ్రీవెన్స్‌డే కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్‌ల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసులు వారివారి వ్యక్తిగత సమస్యలను ఎస్పీ తుహిన్ సిన్హాకు వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వ్యక్తిగత వృత్తిపరమైన, శాఖాపరమైన సమస్యలను తెలుసుకోవడం జరిగిందన్నారు. సాధ్యమైనంత వరకూ తమ సిబ్బంది సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.

108 సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన



బుచ్చెయ్యపేటలో నిరసనకు దిగిన 108 సిబ్బంది

బుచ్చెయ్యపేట : రాష్ట్ర ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు బుచ్చెయ్యపేట మండలం 108 వైద్య సిబ్బంది తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని నల్ల బ్యాడ్జీలతో నిరసనకు దిగారు. శనివారం వైద్య సిబ్బంది 108 సర్వీస్‌ను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని, 108 వైద్య సిబ్బంది అందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని మండల వైద్య సిబ్బంది ప్రవీణ్, వెంకినాయుడు, కుమారస్వామి, శ్రీనివాస్, ప్రసాద్ తదితరులు డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం ఈ నెల 25 నుంచి రాష్ట్రమంతా 108 వైద్య సిబ్బంది సమ్మె బాట పడుతున్నామని, అందరు ఉద్యోగులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

అక్రమంగా తరలిస్తున్న గోవుల పట్టివేత



పోలీసులు పట్టుకున్న పశువుల వ్యాన్లు

నక్కపల్లి: విజయనగరం నుంచి తునికి అక్రమంగా తరలిస్తున్న గోవులను శనివారం నక్కపల్లి పోలీసులు పట్టుకున్నారు. రెండు వాహనాల్లో 46 గోవులను అక్రమంగా తరలిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు వేంపాడు టోల్‌ప్లాజా వద్ద మాటువేసి పట్టుకున్నట్టు ఎస్‌ఐ సన్నిబాబు చెప్పారు. ఆ వాహనాలను స్వాధీనం చేసుకుని, ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. పట్టుకున్న గోవులను పెనుగొల్లులో ఉన్న గోశాలకు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

చిట్టి చేతులు..గట్టి ప్రదర్శనలు

- ఆలోచింప జేసిన నమూనాలు



ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందిస్తున్న డీఈవో

అగనంపూడి: జీవకోటికి ఆధారం ప్రాణవాయువు, అటువంటి ప్రాణవాయువునిచ్చే చెట్లను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అనకాపల్లి డీఈవో అప్పారావునాయుడు అన్నారు. జిల్లా విద్యాశాఖ, ఏపీఎస్‌జీసీ ఆధ్వర్యంలో లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం అనకాపల్లి జిల్లా స్థాయి పర్యావరణ సైన్స్ కాంగ్రెస్–2024లో భాగంగా పోస్టర్ ప్రదర్శన, వేస్ట్ టు బెస్ట్ మోడళ్ల ప్రదర్శన ఏర్పాటు చేశారు. జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొని వారి ప్రతిభాపాటవాలను ప్రదర్శించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలి ఉన్నచోటే జంతువులు, పక్షులు మనుగడ సాధ్యమన్నారు. పాఠశాల హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అనకాపల్లి, విశాఖ జిల్లాల ఏపీఎస్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్లు శిష్టు ఖగేశ్వరరావు, ఎస్.బాబూరావు, ఏపీఎస్‌జీసీ పీవో ప్రసాద్, జూరీ కమిటీ ప్రతినిధి సీహెచ్. పెద్దినాయుడు, క్లస్టర్ కోఆర్డినేటర్ బి.అన్నాజీరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజేతలు వీరే...

పోస్టర్ ప్రజెంటేషన్‌లో...

పోస్టర్ ప్రజెంటేషన్‌లో మొదటి బహుమతి వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల పదో తరగతి విద్యార్థి నందూరి గీతాశ్రీ, ద్వితీయ బహుమతి కుసర్లపూడి పాఠశాల విద్యార్థి ఎం.కార్తీ రక్షిత్, తృతీయ బహుమతి రోలుగుంట పాఠశాలకు చెందిన ఎస్.హర్షిణి దక్కించుకున్నారు.

వేస్ట్ టు బెస్ట్‌లో

వేస్ట్ టు బెస్ట్ ప్రదర్శనలో పరవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి సీహెచ్.లాస్య, ద్వితీయ స్థానం లంకెలపాలెం హైస్కూల్ విద్యార్థి సీహెచ్. భాగ్యలక్ష్మి, తృతీయ స్థానం మామిడిపాలేనికి చెందిన పి.సాయి దుర్గా ప్రసాద్ దక్కించుకున్నారు. అలాగే రెండు విభాగాల్లో ప్రత్యేక ప్రశంసా బహుమతులను పి.సాయి దుర్గా ప్రసాద్, టి.దుర్గా ప్రసాద్, ఎస్.ఝూన్సీ, సీహెచ్.భాగ్యలక్ష్మి, కె.ఫణికుమార్, పి.జయవర్ధన్ అందుకున్నారు.



పర్యావరణ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు చెప్పింది శ్రద్ధగా వింటున్న డీఈవో అప్పారావునాయుడు



అలరించిన పర్యావరణ సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శన

పథకాల అమలులో అధికారులు విఫలం



మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు చిత్రంలో ఎంపీ రమేష్, కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ తుహిన్‌సిన్హా, ఎమ్మెల్యేలు

- సమీక్షలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- పథకాలపై అవగాహన ఉండాలి : ఎంపీ రమేష్

తుమ్మపాల : అధికారుల నిర్లక్ష్యం కారణంగానే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందడం లేదని, పథకాలపై అవగాహన లేక ప్రజలు దరఖాస్తు కూడా చేసుకోలేకపోతున్నారని స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం ఎంపీ సి.ఎం రమేష్ ఆధ్వర్యంలో జిల్లా డెవలప్‌మెంట్ కో–ఆర్డినేషన్, మోనిటరింగ్ కమిటీ (దిశా) సమీక్ష సమావేశంలో స్పీకర్‌తో పాటు కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ తుహిన్‌సిన్హా, జెడ్పీ చైర్మన్ జల్లి సుభద్ర, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, పంచకర్ల రమేష్‌బాబు, సుందరపు విజయకుమార్, కె.ఎస్.ఎన్.రాజు, కార్పొరేషన్ల చైర్మన్లు హాజరై కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయడంలో అధికారులు విఫలమయ్యారని, అధికారులు తమ శాఖల పరిధిలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామస్థాయిలో ప్రచారం కల్పించి క్షేత్ర స్థాయిలో అవగాహన చేయాలన్నారు. ప్రజలు అధికారుల దగ్గరకు వస్తే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోమంటూ తప్పించుకుంటున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అమలు జరిగేందుకు ప్రతి మండలానికి ఒక అధికారిని నియమించాలన్నారు. ఎంపీ సి.ఎం.రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 58 సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని, వాటి వివరాలు ప్రజలకు తెలిసేలా, వినియోగించుకునేలా అధికారులు చూడాలన్నారు. పారిశ్రామికంగా జిల్లా ప్రత్యేక స్థానం ఉందని, పథకాలు గూర్చి అధికారులు ముందుగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతిపాదనలు అందజేస్తే మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, అనకాపల్లి ఎంపీపీ సూరిబాబు, జిల్లా రెవిన్యూ అధికారి బి.దయానిధి పాల్గొన్నారు.

29న ప్రధానితో శంకుస్థాపనలు

ఈ నెల 29న ప్రధాని నరేంద్రమోదీ జిల్లాలో ఉన్న సింహాద్రీ–ఎన్టీపీసీ, ఏపీ జెన్‌కో సంయుక్తంగా చేపట్టనున్న హైడ్రో రూ.లక్ష కోట్ల ప్రాజెక్టు, పాయకరావుపేటలో ఫార్మా ఎస్‌ఈజెడ్ శంకుస్థాపన చేసేందుకు విశాఖ రానున్నట్టు ఎంపీ సి.ఎం.రమేష్ అన్నారు.

గజ్జె ఘల్లుమంది



సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు

ఏయూక్యాంపస్: బీచ్‌రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాలు ఎదురుగా శనివారం ఆదివాసీ స్వాభిమాన ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖ, ఆదివాసీ సాంస్కృతిక పరిశోధన, శిక్షణ మిషన్ సంయుక్తంగా మూడు రోజులు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నాయి. ముందుగా ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ జి.డి.వి.శంకరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంస్కృతిని ప్రతిబింబిస్తూ చేసిన నృత్యాలు విశాఖ వాసులను, పర్యాటకులను ఆకట్టుకున్నాయి. కొమ్ము, థింసా, జానపద నృత్యాలు అలరించాయి. గిరిజన ప్రాంతాల్లోని పాఠశాలల విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు అందరి ప్రశంసలు అందుకున్నాయి. ఈ సందర్భంగా ఐటీడీఏ పాడేరు, శ్రీశైలం, రంపచోడవరం, నెల్లూరు, చింతూరు, సీతంపేట ప్రాంతాల నుంచి ఆదివాసీలు తాము తయారు చేసిన, పండించిన ఉత్పత్తులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాళ్లలో విక్రయించారు. మిల్లెట్ ఉత్పత్తులు, వస్త్రాలు, వెదురు వస్తువులు, మట్టి కళారూపాలు, గిరిజన ప్రాంతాల్లో లభించే తేనె, వెదురు బొంగు చికెన్‌ను విశాఖ వాసులు కొనుగోలు చేశారు.

సింహాచలంలో జల ధారలు సంరక్షించాలి

విశాఖ సిటీ: సింహాచలంలో సహజ సిద్ధ జలధారల సంరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్ పేర్కొన్నారు. శనివారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో సింహాచలం శ్రేణుల్లో జలధారల పరిరక్షణపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జలధారల పరిరక్షణకు సంబంధించి ధాన్ ఫౌండేషన్‌తో వీఎంఆర్‌డీఏ అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. అనంతరం కమిషనర్ విశ్వనాథన్ మాట్లాడుతూ సుస్థిర పర్యావరణ పరిరక్షణపై ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటించారు. ధాన్ ఫౌండేషన్ ప్రతినిధి లోకేష్ మాట్లాడుతూ సింహాచలం కొండ ప్రాంతాల్లో 34 జలధారల్లో 18 ధారలను మ్యాపింగ్ చేసినట్లు చెప్పారు. ఇంకా నీటి వనరులు గుర్తించేందుకు స్థానిక గిరిజన వర్గాల సహకారాన్ని తీసుకుంటున్నట్లు వెల్లడించారు. సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు మాట్లాడుతూ ఆలయ ఆచారాలతో పాటు పర్యావరణానికి ఈ జలధారలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని వివరించారు.

మామిడిపల్లిలో రాష్ట్ర స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు నేడు

దేవరాపల్లి : మండలంలోని మామిడిపల్లిలో రాష్ట్ర స్థాయి ఎడ్ల బళ్ల పరుగు ప్రదర్శనను ఆదివారం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. శ్రీ ఈరుదుమాంబ అమ్మవారి కార్తీక మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి వరుసగా రూ. 20వేలు, రూ. 15వేలు, రూ. 10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు చొప్పున నగదు బహుమతులతో పాటు షీల్డ్‌లను బహుకరించనున్నట్టు తెలిపారు.

ముగిసిన వైభవ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు



స్వామివారి ఊంజల్‌సేవ

ఎస్.రాయవరం : శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఊంజల్‌సేవతో ఘనంగా కల్యాణోత్సవాలు ముగిసాయి. శనివారం స్వామికి యాగశాలలో హోమాలు, పూర్ణాహుతి నిర్వహించి పుష్కరిణిలో స్వామి చక్రస్నానం చేయించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు, చిన్నారులతో కోలాటం నిర్వహించారు, యలమంచిలి సాత్విక్ ఆర్ట్ అకాడమి వారితో దేవతామూర్తులు వేషధారణలో చిన్నారులు నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహించారు. వేడుకలను తిలకించేందుకు రెండో రోజు మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, పాయకరావుపేట వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు చిక్కాల రామారావు, వైఎస్సార్‌సీపీ మాజీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ హాజరయ్యారు. భజన మండలి గురువులను బొలిశెట్టి గోవిందరావు దంపతులు సత్కరించారు.



శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న కోలాటం భక్తులు

విపత్తుల్లో అప్రమత్తం

- ఎన్‌డీఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్ కమాండర్ సత్యనారాయణ

నక్కపల్లి : ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు సమయస్ఫూర్తిగా వ్యవహరించి సహాయక కార్యక్రమాలు నిర్వహించాలని జాతీయ విపత్తు స్పందన దళం(ఎన్‌డీఆర్‌ఎఫ్) 10 బెటాలియన్ కమాండర్ వై. సత్యనారాయణ తెలిపారు. శనివారం విపత్తులు, ప్రమాదాలు సంభవించిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు సహాయక చర్యలపై జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పదో బెటాలియన్ కమాండెంట్ వి.వి.ఎస్ ప్రసన్నకుమార్, జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్ ఆదేశాల మేరకు ఈనెల 11 నుంచి 27 వరకు కోస్తా తీర మండలాల్లో గల గ్రామాలు, పాఠశాలల్లో, పరిశ్రమల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కమ్యూనిటీ అవేర్‌నెస్ కార్యక్రమం ద్వారా ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విపత్తు నివారణ, ఉరుములు, మెరుపు, దుమ్ము , వడగండ్లు, కుంభవృష్టి , బలమైన ఈదురు గాలులు వీచినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇస్తున్నట్టు సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు నిర్వహించిన పలు డెమోలు విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. విపత్తుల సమయంలో తీసుకునే చర్యలపై స్థానికులతో మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నర్సింహమూర్తి, ఎంపీపీ రత్నం, వైస్ ఎంపీపీ నానాజీ, మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటేష్, డీటీ అన్నాజీరావు, ఆర్‌ఐ కన్నబాబు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విపత్తులు జరిగినప్పుడు తీసుకునే చర్యలపై డెమో నిర్వహిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు

వంద కేజీల గంజాయితో ముగ్గురి అరెస్ట్



గంజాయి నిందితులతో డీఎస్పీ శ్రావణి, పోలీసులు

బుచ్చెయ్యపేట : కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయితో పాటు ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు అనకాపల్లి డీఎస్పీ ఎం. శ్రావణి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం బుచ్చెయ్యపేట ఎస్‌ఐ ఎ. శ్రీనివాసరావు ముందస్తు సమాచారంతో చెరకు కాటా వద్ద నాలుగు గంటల ప్రాంతంలో వాహనాలు ఆపి తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో ఆర్‌జే 14సిటి3439 నంబర్ గల కారులో ఆపగా అందులో ఉన్న డ్రైవర్ ముందు, వెనక సీట్లో కూర్చున్న వ్యక్తులు పారిపోబోయారు. వారిని పట్టుకుని కారును తనిఖీ చేయగా, 100 కేజీల గంజాయి బయటపడింది. గంజాయితో రాజస్థాన్ ప్రాంతానికి చెందిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఒడిశా రాష్ట్రం పాడువ గ్రామంలో లక్ష రూపాయలకు గంజాయిని కొని తరలిస్తున్నట్టు నిందితులు వెల్లడించారు. కారును, మూడు సెల్ ఫోన్లు, గంజాయిని సీజ్ చేసి కేసు నమోదు చేసి ముగ్గురిని రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు. నిందితులను చాకచాక్యంగా పట్టుకున్న సీఐ జి.కోటేశ్వరరావు, ఎస్. శ్రీనివాసరావు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



నాతవరంలో...

14 కిలోల గంజాయి స్వాధీనం

నాతవరం: గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్టు నాతవరం ఎస్‌ఐ సీహెచ్.భీమరాజు తెలిపారు. మండలంలో వల్సంపేట, నాతవరం మధ్య రోడ్డులో శనివారం వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఈ మార్గంలో వచ్చిన ముగ్గురు బ్యాగ్‌లను పరిశీలించగా గంజాయి బయటపడిందని చెప్పారు. అల్లూరి సీతారామారాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం లక్కవరపుపేట పంచాయతీ శివారు పోతురాజుగుమ్మల గ్రామానికి చెందిన గెమ్మిల రమేష్, తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఎ.రాజేష్, కన్నిరాజ్‌లను అరెస్టు చేసి, వారి నుంచి 14 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.70వేలు ఉంటుందన్నారు. నిందితుల నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, కోర్టుకు తరలించినట్టు ఎస్‌ఐ చెప్పారు.

క్లుప్తంగా

నేడు అయ్యప్ప స్వామి శోభాయాత్ర

అనకాపల్లి: స్థానిక వేల్పులవీధి అయ్యప్ప స్వామి పంబ పీఠంలో ఆదివారం శోభా యాత్ర నిర్వహిస్తున్నట్లు పీఠం నిర్వాహకులు గుమ్మాల నాగేశ్వరరావు, ఓమ్మి రాము, ముత్త శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామివారి పంచలోహ విగ్రహాన్ని పురవీధుల గుండా ఊరేగిస్తామన్నారు. కోలాటం, తప్పెటగుళ్లు, సన్నాయి మేళం నడుమ ఈ జరుగుతుందన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు ఉజ్వల భవిత



ఎన్‌సీసీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న కేజే సౌరభ్

అనకాపల్లి: ఎన్‌సీసీ కోటాలో విద్యార్థులకు ప్రభుత్వ శాఖలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని హిమశేఖర్ కళాశాల అధ్యక్షుడు కేజే సౌరభ్, ప్రిన్సిపాల్ కె.శ్రీధర్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డులోని కళాశాల ఆవరణలో ఎన్‌సీసీ డే వేడుకలు శనివారం నిర్వహించారు. ఎన్‌సీసీ విద్యార్థులు తరచు విపత్తు ఉపశమనంలో, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుల్లో పాల్గొనవచ్చన్నారు. ఎన్‌సీసీలో క్రమశిక్షణ అలవడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు ఎస్.ధర్మలింగం, ఎంజీ రాజ్‌కుమార్, అధ్యాపకులు, ఎన్‌సీసీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల అనుపు మహోత్సవం



దేవతల వేషధారణలో చిన్నారులు

అనకాపల్లి: స్థానిక లక్ష్మీదేవిపేట శ్రీ గౌరీపరమేశ్వరుల అనుపు మహోత్సవాన్ని శనివారం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవాన్ని పురస్కరించుకుని తెల్లవారు జాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నేలవేషాలు, రాత్రి స్టేజ్ ప్రోగ్రాంలు నిర్వహించారు. రాత్రి 11 గంటలకు ఆలయం వద్ద శూలాల మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బూడిద నాగేశ్వరరావు, ముప్పన లింగేశ్వరరావు, దేశెట్టి చినవెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 3,430 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,800	4,310
మొదటి రకం	3,220	4,070
రెండో రకం	3,200	3,650
మూడోరకం	2,900	3,170

అనకాపల్లి సినిమాలు

జీబ్రా	: రాజా
మందిర	: సత్యనారాయణ స్క్రీన్-1
అమరాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
కంగువ	: పర్తిసాయి
మెకానిక్ రాకీ	: షిర్డిసాయి
లక్కీ భాస్కర్	: వెంకటేశ్వర
సినిమా పిచ్చోడు	: శ్రీసత్య
దేవకీనందన వాసుదేవ	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 41 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్ 8 యూనిట్లు, బి పాజిటివ్-15 యూనిట్లు, ఓ పాజిటివ్-17 యూనిట్లు, ఏబి పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 409 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 371 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

భయం భయం.. ఆ బ్రిడ్జిపై ప్రయాణం

- ప్రమాదాలకు నిలయంగా మారిన కొప్పాక ఏలేరు కాలువ బ్రిడ్జి
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు
- తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణిస్తున్న ప్రజలు



గోతులమయంగా మారిన కొప్పాక ఏలేరు కాలువ బ్రిడ్జి



కొప్పాక గ్రామం నుంచి వాహనాలు యూటర్న్ తీసుకునే ప్రాంతం



ప్రమాదాలకు ఆస్కారంగా మారిన ఏలేరు కాలువ బ్రిడ్జి రహదారి

అనకాపల్లి: జీవీఎంసీ విలీన గ్రామమైన కొప్పాక జాతీయ రహదారిలో ఏలేరు కాలువపై బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకున్నప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కొప్పాక జంక్షన్ వద్ద ఇప్పటికే వందలాది మంది వ్యక్తులు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రైల్వే అధికారుల ఆదేశాల మేరకు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. పాత ఏలేరు కాలువ బ్రిడ్జిని తొలగించకుండా పక్కనే మరో బ్రిడ్జి నిర్మించి రాకపోకలు సాగిస్తున్నారు.

శిథిలావస్థకు చేరుకున్న బ్రిడ్జి..

గాజువాక నుంచి అనకాపల్లి వచ్చే ఏలేరు కాలువ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడం, బ్రిడ్జిపై నుంచి రహదారికి ఇరువైపులా పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో స్థానిక ప్రజలు, రూరల్ పోలీసులు గోతులను పూడ్చి, క్రషర్ బుగ్గి వేస్తున్నారు. ఈ రహదారి మీదుగా నిత్యం వేలాది వాహనాలు అన్నవరం, కాకినాడ, రాజమండ్రి, విజయవాడ, చెన్నై వంటి దూర ప్రాంతాలకు ప్రయాణిస్తుంటాయి. ఏలేరు కాలువ నీరు బ్రిడ్జిని తాకుతూ వెళ్లడం, బ్రిడ్జికి ఇరువైపుల రక్షణ గోడలు లేకపోవడంతో కాలువలో నీరు రహదారిపై ప్రవహించడంతో ఎక్కడ గొయ్యి ఉందో తెలియక భారీ వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. ద్విచక్ర వాహన చోదకులు గోతుల్లో పడి క్షతగాత్రులుగా మారుతున్నారు.

ప్రమాదాలకు నిలయం.. కొప్పాక జంక్షన్..

అనకాపల్లి పట్టణం, మండలానికి ఏలేరు కాలువ బ్రిడ్జి సరిహద్దుగా ఉంటుంది. విశాఖ నుంచి అనకాపల్లి, అనకాపల్లి నుంచి విశాఖకు వచ్చే రెండు ఫ్లైఓవర్ బ్రిడ్జిలు ఏలేరు కాలువ వద్ద ముగిసిపోతాయి. అనకాపల్లి మండలంలో కొప్పాక, కేటీవీ పాలెం, వెంకటాపురం, గోపాలపురం, అక్కిరెడ్డిపాలెం, శీరంశెట్టివానిపాలెం గ్రామాల ప్రజలు కొప్పాక జంక్షన్ నుంచి అనకాపల్లి పట్టణానికి రాకపోకలు సాగిస్తారు. జంక్షన్ వద్ద **సరైన ఏర్పాటు లేకపోవడంతో రైతులు పండించిన పంటలు అనకాపల్లికి తీసుకొచ్చే సమయంలో** రోడ్డు ప్రమాదాలు జరిగి మృత్యువాత పడుతున్నారు. ఎక్కువగా అనకాపల్లి నుంచి విశాఖకు వెళ్లే వాహన చోదకులు బ్రిడ్జిపై నుంచి రావడం, గ్రామీణ ప్రాంతాల ప్రజలు కొప్పాక నుంచి అనకాపల్లికి యూ టర్న్ తిరిగే సమయంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఫ్లైఓవర్ బ్రిడ్జి డౌన్ కావడంతో వాహనాల స్పీడ్‌ను నియంత్రించడం ఇబ్బందిగా ఉంటుంది.

చీకట్లో ప్రమాదాలు..

ఏలేరు కాలువ బ్రిడ్జికి ఇరువైపులా విద్యుత్ లైట్లు లేకపోవడం, రాత్రి సమయంలో చీకటిగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం గాజువాక నుంచి అనకాపల్లి వెళ్లే ఏలేరు కాలువ బ్రిడ్జి వద్ద ముందు వెళ్తున్న బొగ్గు లారీ మరో బొగ్గు లారీని ఢీకొనడంతో వెనక లారీ క్యాబిన్ నుజ్జునుజ్జు అయి స్వల్పంగా మంటలు కూడా వ్యాపించాయి. అనకాపల్లి అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన చేరుకుని మంటలను అదుపుచేసి, లారీ క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ని ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు.

బ్రిడ్జిలకు ఇరువైపుల సేఫ్టీగార్డులు లేవు..

ఫ్లై ఓవర్ రెండు వైపులా సేఫ్టీగార్డులు లేకుండా పోయాయి. ఏదైనా ప్రమాదం జరిగి కింద పడినట్లయితే దిగువన రైల్వే ట్రాక్‌పై పడే ప్రమాదం ఉంది. సుమారు ఏడాది క్రితం విశాఖ నుంచి కాకినాడ కారులో ప్రయాణిస్తున్న నలుగురు యువకులు ప్రమాదానికి గురయ్యారు. ముందు వెళ్తున్న లారీని కారు ఢీకొని బ్రిడ్జిపై నుంచి రైల్వే ట్రాక్‌పై వేలాడుతూ ఉండిపోయింది. అదృష్టవశాత్తు అటుగా వెళ్లే వాహన చోదకులు కారులో ఉన్న నలుగురిని సురక్షితంగా బయటికి తీశారు. జేసీబీ సాయంతో కారును కిందకి దించారు. కారు రైల్వే ట్రాక్‌పై పడినట్లయితే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేది.

రెండేళ్లుగా అవస్థలు పడుతున్నాం..



కొప్పాక ఏలేరు కాలువ బ్రిడ్జి సమస్య సుమారు రెండు సంవత్సరాలుగా ఉంది. అలాగే అవస్థ పడుతున్నాం. చిన్నపాటి వర్షానికి కూడా బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహించడంతో భయం భయంగా గాజువాక నుంచి అనకాపల్లి రావలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ రహదారి గుండా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధుల రాకపోకలు సాగిస్తారు. అయినప్పటికీ ఈ సమస్య గురించి వారు పట్టించుకోవడంలేదు.

– రాజు, వాహన చోదకుడు, అనకాపల్లి

కొప్పాక జంక్షన్ అంటేనే భయం..



ఇప్పటికే కొప్పాక జంక్షన్ వద్ద అనేక ప్రమాదాలు జరిగాయి. గ్రామీణ ప్రాంతాల రైతులు అనకాపల్లి పట్టణానికి కూరగాయలు, ఆకుకూరలు తీసుకొచ్చే సమయంలో ప్రమాదాలు మరింత ఎక్కువగా జరుగుతున్నాయి. కొప్పాక జంక్షన్ నుంచి యూటర్న్ తీసుకునేటప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలి.

– షేక్ ఖాన్, వాహన చోదకుడు, అనకాపల్లి

రేపు మహా మృత్యుంజయ హోమం



పేద మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న అప్పారావు

అనకాపల్లి: మండలంలో బట్లపూడి పంచాయతీ నాయుడుపేట గ్రామం సోహం ఆశ్రమంలో ఈనెల 25 ఉదయం 6 నుంచి సాయంత్రం 5.20 వరకూ మహా మృత్యుంజయ హోమం నిర్వహిస్తున్నట్లు ఆశ్రమం నిర్వాహకులు కాండ్రేగుల రవి శనివారం తెలిపారు. పాల్గొనే భక్తులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని, ఆశ్రమానికి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

బట్లపూడి గ్రామంలో..

స్థానిక బట్లపూడి గ్రామంలో సత్య సాయిబాబా 99వ జయంతిని పురస్కరించుకుని పండూరి అప్పారావు ఆర్థిక సాయంతో పేద మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గొంతిన సత్యారావు, నోట్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ విద్యార్థులకు అభినందన

అనకాపల్లి: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేసిన అగ్రిసెట్ 2024 పాలిసెట్ భర్తీ ఫలితాల్లో స్థానిక ఆర్ఏఆర్ఎస్‌కు చెందిన 15 మంది పాలిటెక్నిక్ అగ్రికల్చర్ విద్యార్థులు శనివారం వివిధ కళాశాలల్లో చేరిన నేపథ్యంలో వారిని శనివారం ఏడీఆర్ సీహెచ్ ముకుందరావు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎం.అహ్మద్ హుసేన్‌కు 13వ ర్యాంక్, పి.సుజాత 16వ ర్యాంక్, వై.శాంతి 20వ ర్యాంక్, యు.లిఖిత 43వ ర్యాంక్, కె.రాహుల్‌రెడ్డి 41వ ర్యాంక్, యు.శేఖర్‌బాబు 58వ ర్యాంక్‌తో పాటు మరో తొమ్మిది మంది విద్యార్థులు వివిధ కళాశాలల్లో చేరినట్లు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి యశోద



రోగులను పరీక్షిస్తున్న ఆరోగ్య సిబ్బంది

కశింకోట: కశింకోటలోని గవరపేట పెద్ద గుమ్మం వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 61 మంది వైద్య సేవలు పొందారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి యశోద రోగులను పరీక్షించి అవసరమైన వారికి షుగర్, రక్త, బీపీ పరీక్షలు జరిపించారు. ఉచితంగా మందులు సరఫరా చేశారు. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారితో పాటు సాధారణ రోగులను తనిఖీ చేశారు. ప్రజలు ఆరోగ్య పరిరక్షణకు పరిశుభ్రత పాటించాలన్నారు. ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. నీరు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు సమీపంలోని వైద్యులను సంప్రదించాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ దుర్గ, ఆరోగ్య సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

డిసెంబర్ 8న ఐలాజ్ రాష్ట్ర మహాసభ



మహాసభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

అనకాపల్లి: ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) సంఘం రాష్ట్ర మహాసభ డిసెంబర్ 8న కాకినాడలో జరుగుతుందని ప్రముఖ లాయర్ పీఎస్ అజయ్‌కుమార్ అన్నారు. స్థానిక వై.విజయకుమార్ భవనంలో శనివారం సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని కోర్టుల్లో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాదులకు సౌకర్యాలు, ప్రయోజనాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలిపారు. మణిపూర్, ఛత్తీస్‌ఘడ్‌లలో జరిగిన అనేక దారుణ ఘటనలపై ఐలాజ్ స్పందించి నిజ నిర్ధారణ కమిటీలో భాగస్వామి అయిందన్నారు. ఆదివాసీలకు అండగా ఉంటుందని, సమాజం పట్ల బాధ్యతగా మెలుగుతుందని తెలిపారు. కొంత మంది న్యాయవాదులు బాధితులకు అండగా నిలవకపోవడం వల్ల అన్యాయం జరుగుతుందన్నారు. అనంతరం మహాసభ కరపత్రికలను ఐలాజ్ రాష్ట్ర కన్వీనర్ బుగత శివ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆదివాసీ సంఘం గౌరవాధ్యక్షుడు మోసు రాజు, నాయకులు తుర్రే రవి, న్యాయవాది నవరాలు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట, తాళ్లపాలెంలో ప్రత్యేక పారిశుధ్య దినోత్సవం



ప్రధాన రహదారిని శుభ్రం చేస్తున్న ఎంపీడీవో రవికుమార్, ఈవోఆర్‌డీ వెంకటలక్ష్మి



చెత్తను శుభ్రపరుస్తున్న అధికారులు, సిబ్బంది

కశింకోట: కశింకోట, తాళ్లపాలెం గ్రామాల్లో శనివారం ప్రత్యేక పారిశుధ్య దినోత్సవం నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయా గ్రామాల్లోని వీధుల్లో చెత్త తొలగించి శుభ్రపరిచారు. ఎంపీడీవో వి.వి. రవికుమార్, ఈవోఆర్‌డీ ఎం. వెంకటలక్ష్మి చీపుళ్లు చేతబూని రోడ్లను కొంతసేపు శుభ్రపరిచారు. ఏపీవో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు రామచంద్రరావు, సత్యారావు, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కపిల ఆవుల గోశాలలో సందడిగా వన సమారాధన

నాతవరం: కార్తీకమాసంలో కపిల ఆవుల గోశాల ప్రాంగణంలో కార్తీక సమారాధన కార్యక్రమం నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ అన్నారు. మండల కేంద్రం శివారు తాండవ కాలువ వద్ద ఆవుగడ్డ శివకు చెందిన కపిల ఆవులు గోశాలలో శనివారం కార్తీక వనసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన తహసీల్దార్ వేణుగోపాల్ మాట్లాడుతూ కనుమరుగవుతున్న కపిల ఆవులను ఈ ప్రాంతంలో పెంచడం చూస్తే చాలా ఆనందంగా ఉందన్నారు. గోశాల నిర్వహకులు ఆవుగడ్డ శివను అభినందించారు. ఇంఛార్జి ఎంపీడీవో పార్థసారథి, ఎంఈవో వరహాలబాబు, వెలుగు ఏపీఎం కనక రాజు, ఉపాధి హామీ ఏపీవో చిన్నారావు, తాండవ మాజీ చైర్మన్ కొండబాబు, మాజీ ఎంపీటీసీ మాణిక్యం, మాజీ ఎంపీపీ లక్ష్మి పాల్గొన్నారు. తాండవ రిజర్వాయరు సరుగుడు జలపాతం వద్ద సందర్శకులు కార్తీక మాసం శనివారం కావడంతో మహిళలు సరదగా గడిపారు. ప్రాజెక్టు దిగువనున్న శ్రీనల్లగొండమ్మ తల్లిని దర్శించుకుని పార్కులో ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు.

మాడుగుల రూరల్: వీరవల్లి అగ్రహారం సుంకర వారి కళ్లాల వద్ద శనివారం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన సుంకర వారి కుటుంబీకులు ఏటా కార్తీక మాసంలో ఈ సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేస్తుంటారు.

కేజీబీవీ మురుగునీటి సమస్య పరిష్కారానికి కృషి

దేవరాపల్లి: రైవాడ పంచాయతీ శివారు బేతపూడి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో మురుగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని దేవరాపల్లి ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజు అన్నారు. బేతపూడి కేజీబీవీని సర్పంచ్ చల్లా లక్ష్మితో కలిసి శనివారం ఆయన సందర్శించారు. కేజీబీవీలోని మురుగునీరు పంట పొలాల్లోకి వెళ్లడంతో బాధిత రైతులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేజీబీవీలో డ్రైనేజీని ఆయన పరిశీలించారు. సర్పంచ్‌తో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ భువన మాధురితో మురుగునీటి సమస్య పరిష్కార మార్గంపై చర్చించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఆయన వెంట స్థానిక పంచాయతీ సెక్రటరీ జామి అప్పారావు, మాజీ సర్పంచ్ చల్లా తాతయ్యలు, స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ త్రినాథ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెలకువలతో వరి పంటకు రక్షణ

అనకాపల్లి: వాతావరణ పరిస్థితుల కారణంగా వరిలో రెల్లరాల్చు పురుగు ఆశించే అవకాశం ఉందని, నివారణకు పొలానికి ముందుగా నీరుపెట్టి క్లోరిఫైరిఫాస్ 2.5 మిల్లీలీటర్ల వేప నూనె 5.0 మిల్లీలీటర్లు లీటరు నీటిలో కలిపి సాయంత్రం వేళ పిచికారీ చేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వాతావరణంలో వరిలో కాండం తొలిచే పురుగు పెరిగే అవకాశం ఉందని, నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలను ఎకరానికి 4 కిలోల చొప్పున లేదా క్లోరాంత్రనిలిప్రోల్ 0.4జి గుళికలను ఎకరానికి 4 కిలోల చొప్పున 8 కిలోలు ఇసుకలో కలిపి చల్లుకోవాలన్నారు. పూత దశలో ఉన్న ఆర్‌జీఎల్ వరి రకంలో మానిపండు, మెడ విరుపు తెగుళ్లు ఆశించే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యగా లీటరు నీటికి 1 మిల్లీలీటర్ ప్రోపికొనజోల్‌ను పిచికారీ చేయాలని తెలిపారు. రబీలో వరి వేసే రైతులు నారుమడి వేసుకోవాలని, ఎకరానికి 20–25 కిలోల వరి విత్తనం సరిపోతుందన్నారు. రబీ కాలానికి అనువైన రాగిలో కొత్త రకాలైన ఇంద్రావతి, వేగావతి వంటి రకాలను ఎంపిక చేసుకుని ఎకరానికి 2.5 కిలోలు చొప్పున నారు వేసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో వేసిన చెరకు గత వర్షాలకు మునిగి ఉంటే వీలైనంత త్వరగా కోసి బెల్లం ఆడుకోవాలని లేదా ఫ్యాక్టరీ అందుబాటును బట్టి కోసి ఫ్యాక్టరీకి తరలించాలన్నారు. రబీలో వేరుసెనగ వేసే రైతులు అధిక దిగుబడినిచ్చే మేలైన రకాలను ఎంపిక చేసుకుని ఇమిడాక్లోప్రిడ్ 2 మిల్లీలీటర్లు 4 మిల్లీలీటర్ల నీటిలో కిలో విత్తనానికి కలిపిన తర్వాత టెబుకొనజోల్ 2 శాతం డీఎస్‌ను కిలో విత్తనానికి 1 గ్రాము చొప్పున కలిపి విత్తుకోవాలని తెలిపారు. దుక్కిలో 18 కిలోల యూరియా, 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 35 కిలోల మ్యూరెట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలన్నారు. వరి మాగాణుల్లో జనుము వేసే రైతులు ఎకరానికి 10 కిలోల చొప్పున విత్తుకోవాలిలని, టమాటాలో ఆకు ముడత తెగులు నివారణకు అసిటాంప్రిడ్ 0.2 గ్రాములు లేదా థయోమిథాక్సం 0.2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.

జ్ఞానం, సేవలతోనే నిజమైన ఆనందం



సత్య సాయి పూజకు హాజరైన భక్తులు



నృత్యం చేస్తున్న బాల వికాస్ బాలికలు

కశింకోట: స్థానిక కోమటి వీధిలో వెలసిన సత్య సాయి సేవా మందిరంలో సాయిబాబా జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా జయంతి కేక్ కట్ చేసి భక్తులకు పంపిణీ చేశారు. ముందుగా ఉదయం ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, సాయి బోధనలు వివరించారు. ఈ సందర్భంగా సత్యసాయి బాల వికాస్ జిల్లా కో-ఆర్డినేటర్ ఏపీ శక్తిమూర్తి మాట్లాడుతూ జ్ఞానం, సేవ అనేవి రెండు రెక్కలవంటివని, ఇవి మనిషి ఆనందానికి మూలంగా నిలుస్తాయని సాయి బాబా పేర్కొన్నారన్నారు. అలాగే ఇబ్బందుల్లో ఉన్న వారికి సేవ చేయడం, ఎవరినీ నొప్పించకుండా ఉండాలనారన్నారు. దేశం పట్ల బాధ్యత కలిగి ఉండాలని, ఆత్రుత, ఆందోళనలకు దూరంగా ఉంటూ జీవితాన్ని సార్థకత చేసుకోవాలని ఉద్బోధించారన్నారు. బాబా బోధనలను ప్రతి ఒక్కరూ పాటించి శాంతియుత జీవనం సాగించాలన్నారు. ఈ సందర్భంగా బాల వికాస్ పిల్లలు నృత్యాలు, భజన, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి ఆహూతులను అలరించారు. చివరిగా హారతి ఇచ్చారు. ప్రసాద వితరణ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మందిరం కన్వీనర్ ముక్కా అప్పలనాయుడు, బాల వికాస్ గురువరిని కోడూరు చిన్నమ్మలు పాల్గొన్నారు.

పశువుల్లో అతిగా యాంటీబయాటిక్స్‌తో దుష్ఫలితాలు

మాడుగుల : ప్రపంచ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా యాంటీ బయోటిక్స్ వినియోగంపై స్థానిక డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పశువైద్యశాఖ ఏడీ వి. చిట్టి నాయుడు మాట్లాడారు. ప్రస్తుత కాలంలో పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లలో యాంటీబయోటిక్స్, ఇతర ఔషధాల వినియోగం పెరిగిపోవడం వల్ల, అత్యవసర పరిస్థితిలో అవి పని చేయకుండా పోతున్నాయని, సరైన వ్యాధికి సరైన మందు వాడకం ఉండాలన్నారు. అవసరం లేకుండా ఔషధాల వినియోగం వల్ల పశువుల్లో దుష్ఫలితాలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, శాస్త్రి పాల్గొన్నారు.

టమాటా రైతులు కుదేలు



లింగంపేటలో టమాటా సాగు

గొలుగొండ : టమాటా రైతు కుదేలు అయ్యాడు. డివిజన్‌లో ఎక్కువ సాగు జరిగే గొలుగొండ మండలంలో ఈ సాగు చేసే రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. 300 ఎకరాలకు పైగా పంట వేరుకుళ్లు తెగులు సోకి పంట కాపు దశలో నేలమట్టం అయ్యింది. విత్తనాలలో నాణ్యత లేకపోవడమే ప్రధాన కారణంగా రైతులు, ఉద్యానవనశాఖ అధికారులు భావిస్తున్నారు. లక్షలు రూపాయలు నేలమట్టం కావడంతో రైతులు లబోదిబో అంటున్నారు.

300 ఎకరాలకు పైగానే సాగు

ప్రతి ఏటా ఈ సీజన్‌లో గొలుగొండ మండలం లింగంపేట, చోద్యం, గొలుగొండ, చిన్నయ్యపాలెం, కొత్తమల్లంపేట, అమ్మపేట, రామచంద్రపురం, గుజ్జుమానుపాకల, ఏఎల్ పురం తదితర గ్రామాల్లో విస్తారంగా సాగు చేయడం జరుగుతుంది. అయితే ప్రతి ఏటా ఆగస్టు, అక్టోబర్‌లో నాట్లు వేయడం జరుగుతుంది. అయితే మొక్కలు ఏపుగా పెరిగి పిందె దశలో ఈ తెగుళ్ల విజృంభించడం రైతులకు శాపంగా మారింది. పంటంతా నాశనం అవుతుంటే ఏమి చేయాలో తెలియక రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎకరానికి 30 నుంచి 40 వేల వరకు ఖర్చు అయ్యిందని రైతులు అంటున్నారు.

వేరుకుళ్ల తెగుళ్ల అధికం

పై గ్రామాల్లో నాట్లు వేసిన రైతులు నారు పెంచినప్పటి నుంచి జాగ్రత్తలు పాటిస్తున్నారు. పంట నాట్లు వేసి నెల రోజులు అయినప్పటి నుంచి వేరుకుళ్ల తెగుళ్ల ప్రారంభం కావడం జరిగింది. పంట పెరిగే సమయంలో ఈ వ్యాధి రావడంతో మొక్క రెండు రోజుల్లో చనిపోతుంది. చాలా సంవత్సరాలు నుండి టమాటా సాగు చేసి అనుభవం ఉన్న రైతులు కూడా ఏమి చేయలేక చేతిలెత్తేసారు.

విత్తన లోపం.. టమాటా సాగు రైతులకు ప్రధాన సమస్య విత్తన నాణ్యత లోపం. ఈ కారణం వల్లనే ఇటువంటి తెగుళ్లు వస్తున్నట్టు రైతులు అంటున్నారు. మార్కెట్‌లో హైబ్రీడ్ విత్తనాలు పేరుతో మోసం జరుగుతున్నా అధికారులు చర్యలు చేపట్టడం లేదని అంటున్నారు. నర్సీపట్నం మార్కెట్‌లో టమాటా విత్తనాలు అధికంగా అమ్మకాలు చేస్తుంటారు. అధిక రేట్లు తీసుకొని విత్తనాలు నాణ్యత లేనివి తీసుకువచ్చి రైతులకు అమ్మకాలు చేయడం వల్లనే ఇటువంటి సమస్య వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.